సాక్షి ఖమ్మం

గురువారం । 15 । జూన్ । 2023



పల్లె.. కళ కళ !

ప్రస్తుతం నగరాలకు దీటుగా పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయి. జిల్లాలోని జీపీలకు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. 4లో



ఉక్కపోత .. వడగాల్పులు

ఉష్ణోగ్రతలు తగ్గకపోగా వడగాల్పులు తోడయ్యాయి. దీంతో జిల్లా వాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 4లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 43° / 31°

జిల్లాలో గురువారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గంటగంటకూ ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు రఘునాథపాలెం మండలం హర్యాతండా, 9.20కి బద్యా తండా, 9.40కి కొర్లబోడు తండా, 10 గంటలకు పుటాని తండా, 10.20కి సూర్యతండా, 10.40 గంటలకు జింకలతండా గ్రామాల్లో పర్యటించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. 11 గంటలకు ఖమ్మంలో పర్యటించనున్నారు.

అవార్డులు దక్కడం హర్షణీయం

రాష్ట్రంలోని యాదాద్రి దేవాలయం సహా ఐదు నిర్మాణాలకు అంతర్జాతీయ అవార్డులు లభించడం హర్షణీయమని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లండన్‌కు చెందిన గ్రీన్ ఆర్గనైజేషన్ ఈ అవార్డులను ప్రకటించి ఈనెల 16న అందించనుండడం గొప్ప విషయమని, అవార్డులను ప్రభుత్వం తరఫున పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ అందుకోనున్నారని తెలిపారు. అవార్డులు పొందిన వాటిలో యాదాద్రి ఆలయం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, తెలంగాణ సచివాలయం, పోలీసు కమాండ్ కంట్రోల్ రూం, మొజాంజాహీ మార్కెట్ ఉన్నాయని, దేశంలోనే తొలిసారిగా తెలంగాణ నిర్మాణాలకు గ్రీన్ యాపిల్ అవార్డులు దక్కడం విశేషమని పేర్కొన్నారు.

ప్రయాణికుల రక్షణకు పెద్దపీట



మాట్లాడుతున్న అశోక్ కుమార్ గుప్తా

ఖమ్మం మామిళ్లగూడెం : ప్రయాణికుల రక్షణకు పెద్దపీట వేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ అశోక్‌కుమార్ గుప్తా అన్నారు. బుధవారం ఆయన ఖమ్మం రైల్వే స్టేషన్‌లో సిబ్బందికి ప్రయాణికుల రక్షణపై అవగాహన కల్పించారు. వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సౌకర్యాల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ బి.కృష్ణారెడ్డి, సీనియర్ డీఓఎం సురేష్ రెడ్డి, సీనియర్ డీసీఎం ఎం.బస్వరాజ్, సీసీఐ జాఫర్, ఎస్ఎం జీఎస్‌వీ ప్రసాద్, హెచ్ఐ మోహన్‌కుమార్, డీఐ శాస్త్రి, సీబీఎస్ఆర్ జె.వెంకటేశ్వర్లు, సీటీఐ శైలేంద్ర, శ్రీనివాసరావు, ద్రోణాచార్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంక్రైం : పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలోని శిక్షణా కేంద్రంలో బుధవారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియ 11 రోజుల పాటు సాగుతుంది. సీపీ విష్ణు ఎస్ వారియర్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఐ, కానిస్టేబుళ్ల ఉద్యోగాల భర్తీలో భాగంగా ఇటీవల నిర్వహించిన రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు బోర్డు సూచనలను అనుసరించి సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుమారస్వామి, కార్యాలయ ఏఓ అక్తరున్నీసాబేగం, సీఐ శ్రీనివాస్, ఆర్ఐ తిరుపతి, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడితే సహించం

ఖమ్మంసహకారనగర్: కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూసుమంచి మండలం ముత్యాలగూడెంలో అధికార పార్టీ నేతలు అల్లర్లు సృష్టించి పార్టీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే దీనిని ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో చోటుచేసుకున్న సంఘటనలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. సమావేశంలో పాలేరు నియోజకవర్గ పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, మాలోత్ రాందాస్ నాయక్, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరావు పాల్గొన్నారు.

పేదలకు పెద్ద వైద్యం



గర్భిణికి న్యూట్రిషన్ కిట్ అందిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

రక్త హీనత నివారణకు న్యూట్రిషన్ కిట్లు..

గర్భిణుల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేయడం శుభ పరిణామమని మంత్రి పువ్వాడ అన్నారు. తొలి విడతలో పలు జిల్లాల్లో అందజేయగా, రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గతంలో 70 ఏళ్లు పాలించిన వారి హయాంలో 3 కళాశాలలు వస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత 33 మెడికల్ కళాశాలలు వచ్చాయని వివరించారు. నేడు ఏ జబ్బు చేసినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందుతోందని అన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు..

- ప్రతి జిల్లాకూ మెడికల్ కళాశాల
- క్షేత్ర స్థాయిలో ఉత్తమ చికిత్సలకు పల్లె, బస్తీ దవాఖానాలు
- న్యూట్రిషన్ కిట్ల పంపిణీలో మంత్రి పువ్వాడ



రక్తదానం చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం : నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అంటూ ఓ సినీ కవి రాసిన పాట ఇప్పుడు రివర్స్ అయిందని, నేను వస్త బిడ్డో సర్కారు దవాఖానకు అని పాడుకునే రోజులు వచ్చాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య, ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రేడియాలజి ల్యాబ్, డయాలసిస్ సెంటర్, కీమోథెరపీ వార్డులను మంత్రి ప్రారంభించారు. అనంతరం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా ఆస్పత్రిలో ఒకప్పుడు సరిపడా వైద్యులు ఉండేవారు కాదని, నర్సులు, సిబ్బంది కూడా తక్కువగా ఉండేవారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ప్రతీ విభాగానికి ప్రత్యేక వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించామని తెలిపారు. ఒకప్పుడు 250 పడకల్లోనే 500 మంది ఉండేవారని, ఇప్పుడు 500 పడకల సామర్థ్యానికి పెంచుకున్నామని చెప్పారు. ప్రత్యేక మాతా శిశు ఆరోగ్య కేంద్రం, ట్రామా కేర్, క్రిటికల్ కేర్ యూనిట్, డయాలసిస్ ఇలా అనేక రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

రూ.166 కోట్లు విడుదల..

వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.166 కోట్లు కేటాయించగా, 100 ఎంబీబీఎస్ సీట్లతో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయని, కళాశాలకు కేటాయించిన పాత కలెక్టరేట్ భవనం ఆధునికీకరణకు రూ.9 కోట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జికి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ ఆస్పత్రిలో 134 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్ రే, అల్ట్రా సౌండ్, మెమోగ్రఫీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. స్టెమీ కార్యక్రమం ద్వారా రూ. 40 వేల విలువైన ఇంజెక్షన్‌తో గుండెపోటు బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

కోవిడ్‌లో కంటికి రెప్పలా..

కోవిడ్ వంటి విపత్కర సమయంలో ప్రైవేట్ దవాఖానాలు మూతపడగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించిన ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని మంత్రి అజయ్‌కుమార్ అన్నారు. డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుతో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు అత్యంత ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతోందని, పాలియేటివ్ కేర్ సెంటర్ల ఏర్పాటుతో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు. రేడియాలజీ హబ్ ఏర్పాటుతో సీటీస్కాన్, ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి వచ్చాయని, మాతా శిశు ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. జిల్లాలోని 161 సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చి వైద్యులను నియమించామని, మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రాల్లోని అన్ని దవాఖానాల్లో ప్రత్యేకంగా ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రాణవాయువును అందిస్తున్నామన్నారు. వృద్ధుల కోసం పాలియేటివ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. కోవిడ్ సమయంలో ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మరింతగా సేవ చేస్తా..

సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గిఫ్ట్–ఎ–స్మైల్ పేరున తన సొంత డబ్బుతో అంబులెన్స్ ఏర్పాటు చేశానని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఇంకా అనేక రకాల సేవలు అందిస్తామన్నారు. కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాల ద్వారా అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.లక్షలు ఖర్చయ్యే గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్యం అందుతుందని చెప్పారు. ప్రతీ గర్భిణికి రెండు విడతల్లో న్యూట్రిషన్ కిట్లు అందిస్తామని వివరించారు. అనంతరం ఉత్తమ వైద్యులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

కాగా, ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎంహెచ్ఓ మాలతి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

22 లోగా పరిశీలన పూర్తి చేయాలి: కలెక్టర్ గౌతమ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంసహకారనగర్: బూత్ లెవల్ అధికారులతో ఓటర్ జాబితా డోర్ టు డోర్ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 22 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం ఐడీఓసీ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీడీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన వారి పేరు ఓటరు జాబితాలో ఉంటే, తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అన్నారు. షిఫ్ట్ అయిన వారు ఉంటే ఫారం 7 సేకరించాలన్నారు. ఆయా ఇంట్లో వచ్చే అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండేవారు, ఇప్పటికే 18 సంవత్సరాలు నిండి, ఓటు హక్కు పొందని వారు ఉంటే ఫారం 6 సేకరించాలన్నారు. మొబైల్ నంబర్ తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. మార్పులకు ఫారం 8 సేకరించాలని తెలిపారు. ఈ దిశగా బూత్ లెవల్ అధికారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లో ఉన్న వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఉండేదని, ఇప్పుడు దివ్యాంగులు, 80 సంవత్సరాల వయసు పైబడిన వారికి కూడా ఈ అవకాశం ఇవ్వనున్నారని తెలిపారు. ఈ తరహా వారిని గుర్తించి, జాబితాలో మార్క్ చేయాలన్నారు. రోజుకు ఒక బూత్ లెవల్ అధికారి, కనీసం 30 నుంచి 40 ఇళ్ల తనిఖీలు చేపడితేనే లక్ష్యం పూర్తవుతుందని, ఈ దిశగా కార్యాచరణ చేపట్టి, పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్లు రాధిక గుప్తా, మయాంక్ సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, ఎస్డీసీ దశరథం, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధతకు చర్యలు చేపట్టాలి

రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత కార్యక్రమాలను పూర్తిచేసేలా జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. జిల్లాలో ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాలని సూచించారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ వి.పి. గౌతమ్, సీపీ విష్ణు ఎస్. వారియర్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ కుమార్, ఆర్డీవోలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో కటౌట్‌లను లారీలోకి ఎక్కిస్తున్న దృశ్యం

కాషాయంలో నైరాశ్యం

ఖమ్మంలో అమిత్ 'షో' రద్దు

- వారం రోజులుగా సభ కోసం ముమ్మర ఏర్పాట్లు
- బిపర్‌జోయ్ తుపానుతో పర్యటన రద్దు చేసుకున్న కేంద్ర హోంమంత్రి
- త్వరలోనే పర్యటన ఉంటుందన్న పార్టీ రాష్ట్ర నేతలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఖమ్మం పర్యటన రద్దయింది. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో సముద్ర తీరం వెంట బిపర్‌జోయ్ తుపాను ప్రభావం చూపనుండడంతో ముందస్తుగా కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ నేపథ్యంలో గురువారం ఖమ్మంలో జరగాల్సిన అమిత్‌షా బహిరంగ సభ వాయిదా పడినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ట్విటర్ ద్వారా తెలిపారు. అంతేకాక రాష్ట్ర పార్టీ నేతలు కూడా జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పర్యటన వాయిదా పడినట్లు చెప్పడంతో పాటు త్వరలో మరో తేదీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో గత వారం రోజులుగా సభ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు నిలిచిపోయాయి. పార్టీ నేతల ఫొటోలతో ఏర్పాటు చేసిన కటౌట్లు, ఫ్లెక్సీలను తొలగించారు. అమిత్‌షా పర్యటన నేపథ్యంలో బండి సంజయ్ సభా ప్రాంగణాన్ని ఎంపిక చేయడంతోపాటు సభ విజయవంతానికి ఐదు రోజులుగా రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి సూచనలు చేశారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. అయితే అమిత్‌షా పర్యటన వాయిదా పడిందన్న సమాచారంతో పార్టీ శ్రేణులు కొంత నైరాశ్యానికి గురయ్యాయి.

భారీ సభ అని ప్రచారం చేసి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు ఖమ్మం వేదికైంది. నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'మహా జన సంపర్క్ అభియాన్' పేరుతో సభలు నిర్వహించాలని తలపెట్టింది. తెలంగాణలో మూడు సభలు ఏర్పాటు చేస్తుండగా.. మొదటగా ఖమ్మంలో గురువారం నిర్వహించే సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనేలా షెడ్యూల్ ఖరారైంది. ఈ పర్యటనకు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒకరోజు ముందే షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. అమిత్‌షా 14వ తేదీ రాత్రికి హైదరాబాద్ చేరుకుని 15న భద్రాచలంలో రామయ్య దర్శనం, ఆ తర్వాత ఖమ్మంలో సభ, అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ వెళ్లి.. అక్కడి నుంచి గుజరాత్‌కు వెళతారని షెడ్యూల్ ప్రకటించింది. ఈ షెడ్యూల్‌తో రాష్ట్ర, జిల్లా బీజేపీ నాయకత్వం మరింత జోష్‌తో ఏర్పాట్లు కొనసాగించింది. అధికార యంత్రాంగం కూడా అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టింది.

కేంద్ర బలగాలు పరిశీలించి..

సభ ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. సభ నిర్వహించే ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ గ్రౌండ్‌తోపాటు నగరమంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పలు కూడళ్లలో బీజేపీ జెండాలు రెపరెపలాడుతుండగా తోరణాలు అలంకరించారు. లక్ష మందికి తగ్గకుండా జన సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వీరిని తరలించేందుకు వాహనాలు కూడా ఏర్పాటు చేశారు. బందోబస్తుపై స్థానిక పోలీసులు దృష్టి సారించగా.. సీఆర్‌పీఎఫ్ బలగాలు ఢిల్లీ నుంచి బుధవారం హెలీకాప్టర్‌లో ఖమ్మం చేరుకుని హోంమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించాయి. అమిత్‌షా పూలమాలలు వేయనున్న ఎన్టీఆర్ విగ్రహాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. అనంతరం సీఆర్‌పీఎఫ్ అధికారులు కలెక్టర్, సీపీలతో సమావేశం అయ్యారు.

నేతలంతా ఖమ్మంలోనే..

బహిరంగ సభ ఖరారైనప్పుడే బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలంతా ఖమ్మం చేరుకున్నారు. ఈనెల 9న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖమ్మం వచ్చి పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ విజయవంతంపై దిశానిర్దేశం చేశారు. ఖమ్మంలో బీజేపీ సత్తా చాటాలని కేడర్‌లో జోష్ నింపారు. అనంతరం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ గ్రౌండ్‌లను పరిశీలించి.. డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను ఎంపిక చేశారు. ఆయనతో పాటు వచ్చిన పలువురు రాష్ట్రస్థాయి నేతలు నాటి నుంచి ఖమ్మంలోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ సభ కావడంతో ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఉండేలా అన్ని విషయాలను దగ్గరుండి చూసుకున్నారు. మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నేతలు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మళ్లెప్పుడో..

బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించడంతో జిల్లా నేతలు, కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. 'మహాజన్ సంపర్క్ అభియాన్' సభ ఖమ్మంలో నిర్వహించే అవకాశం రావడంతో సత్తా చాటేందుకు ఇదే మంచి తరుణమని భావించారు. ఆఖరు నిమిషాన అమిత్‌షా పర్యటన వాయిదా పడటం నేతలను కొంత నిరాశకు గురిచేసింది. అయితే అమిత్‌షా పర్యటన త్వరలోనే ఉంటుందని ఆ పార్టీ నేతలు తెలిపారు. మళ్లీ ఎప్పుడు పర్యటన ఉంటుందనేది మాత్రం ఇంకా స్పష్టమైన తేదీ ఖరారు కాలేదు.

కమనీయంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి కల్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. బుధవారం సందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం గావించారు.

తరుముకొచ్చిన మృత్యువు

- బూర్గంపాడు వద్ద ట్రాలీ ఆటో బోల్తా
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- మృతుల్లో తండ్రి, ఇద్దరు కుమారులు



లోయలో పడిన ట్రాలీ ఆటో



ప్రమాదంలో మృతిచెందిన దుర్గారావు

బూర్గంపాడు: భద్రాద్రి రామయ్యను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని ఆనందంగా తిరుగుపయనమైన మూడు కుటుంబాలలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. అప్పటివరకు భక్తిభావంలో మునిగిన ఆ కుటుంబాలను దేవుడు కూడా కనికరించలేదు. ట్రాలీ ఆటో రూపంలో తరుముకొచ్చిన మృత్యువు తండ్రిని ఇద్దరు కొడుకులను పొట్టనబెట్టుకుంది. వీరితోపాటు తోడల్లుడిని కూడా తీసుకుపోయింది. ఈ విషాదకర ఘటన బూర్గంపాడుకు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన జట్ల దుర్గారావు, అతని భార్య నిర్మల, వారి ఇద్దరు పిల్లలు సందీప్, ప్రదీప్, దుర్గారావు తోడల్లుడు పచ్చిపాల శ్రీనివాసరావు, అతని భార్య కమల, కుమార్తె రవిత్రేణి, శ్రీరామ్, దుర్గారావు బావమరిది దాసరి నర్సింహారావు అతని భార్య అనూష, వారి పిల్లలు రక్షిత, మేఘన.. మొత్తం పన్నెండుమంది బుధవారం తెల్లవారుజామున భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చారు. దాసరి నర్సింహారావుకు చెందిన ట్రాలీ ఆటోలో వీరంతా భద్రాచలం వచ్చారు. దర్శనం అనంతరం భోజనాలు చేసి తిరుగుపయనమయ్యారు. బూర్గంపాడు ప్రధానకూడలిలో కొద్దిసేపు ఆగి కూల్‌డ్రింక్స్ తాగారు. అక్కడి నుంచి బయలుదేరిన ఐదు నిమిషాలలోనే తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బూర్గంపాడుకు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ట్రాలీ ఆటో అదుపు తప్పి 70 అడుగుల లోతులోని కిన్నెరసాని నదిలో పడిపోయింది. ఈ ఘటనలో జట్ల దుర్గారావు(36), అతని తోడల్లుడు పచ్చిపాల శ్రీనివాసరావు(40) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఆర్తనాదాలు చేస్తున్న మిగతావారిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో దుర్గారావు ఇద్దరు కుమారులు జట్ల సందీప్(12), జట్ల ప్రదీప్(10) చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడు శ్రీనివాసరావు కుమార్తె రవిత్రేణి, నర్సింహారావు కుమార్తె రక్షిత పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో వారిని విజయవాడకు తరలించారు. ఈ ఘటనలో నర్సింహారావు, నిర్మల, అనూష, కమల, శ్రీరామ్‌లకు కూడా గాయాలయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతిచెందటంతో తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన బంధువులు, ఇతర కుటుంబ సభ్యులు బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. మృతుల బంధువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది. మంగళవారం రాత్రి తిరుమలదేవిపేట నుంచి బయలుదేరి భద్రాచలం చేరుకున్న వీరు బుధవారం తెల్లవారుజామున దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం భోజనాలు చేసి కొద్దిసేపు షాపింగ్ చేసుకుని ట్రాలీ ఆటోలో బయలుదేరారు. రాత్రంతా నిద్రలేని కారణంగా భోజనం చేసిన తర్వాత డ్రైవర్ నర్సింహారావు డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో కునికిపాటు వచ్చి ఉండటంతోనే ఆటో అదుపు తప్పి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఆ సమయంలో అటుగా ఎటువంటి వాహనాలు కూడా ఎదురురాలేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డు కూడా గోతులు లేకుండా బాగానే ఉందని, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై సంతోష్ ఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికులతో కలసి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు సహకరించారు. బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వైద్య శాఖ సేవలు మరువలేనివి

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర: రాష్ట్రంలో వైద్యశాఖ సేవలు మరవలేనివని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రశంసించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధిరలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో వైద్య రంగం శరవేగంగా అభివృద్ధి చెందిందని, జిల్లాకో మెడికల్ కాలేజీ, కార్డియాలజీ విభాగాలు, డయాలసిస్ సెంటర్లు, మాతా శిశు ఆస్పత్రులు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కంటివెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వైద్య రంగంలో వివిధ విభాగాలలో ఉత్తమ సేవలు అందించిన వారికి మెమెంటోలు అందజేసి అభినందించారు. గర్భిణుకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఖమ్మం మార్కెట్‌లోకి హీరో ప్యాషన్ ప్లస్



ప్యాషన్ ప్లస్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న నాగభూషణం తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: కస్టమర్లలో ప్యాషన్ ప్లస్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని హీరో మోటో కార్ప్ ప్యాషన్ ప్లస్ వాహనాన్ని అత్యాధునిక హంగులతో తిరిగి మార్కెట్‌లోకి విడుదల చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని వైరారోడ్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ హీరో షోరూంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం హీరో ప్యాషన్ ప్లస్ వాహనాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వర్‌ప్రగడ హరిబాబు, రంగనాథ్, భార్గవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పామాయిల్ తోటకు నిప్పు

మధిర: మధిర మండలం మడుపల్లి రెవెన్యూ పరిధిలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పామాయిల్ తోటకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో సుమారు నాలుగు ఎకరాల్లో ఉన్న చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మిగిలిన 10 ఎకరాల్లో చెట్లను కాపాడేందుకు ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయమై శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులు మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కామేపల్లి(కారేపల్లి): ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కామేపల్లి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని బర్లగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ బాబు (50) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల అడ్డగింత

నేలకొండపల్లి: అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చందాపురం రెవెన్యూ పరిధి నుంచి వెంచర్లకు అక్రమంగా అనాసాగారం మీదుగా మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మేళ్లచెరువు అరుణ భర్త, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు తన అనుచరులతో టిప్పర్లను అడ్డగించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దారా ప్రసాద్‌తో వెంకటేశ్వరరావు వాగ్వాదానికి దిగారు. అక్రమాన్ని ప్రజాప్రతినిధులు అడ్డుకుంటే అధికారులు సహకరించటం లేదన్నారు. ఆయన ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఓ జేసీబీని సీజ్ చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

ఖమ్మంగాంధీచౌక్: తప్పిపోయి తిరుగుతున్న బాలుడిని రక్షించి తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జీవనోపాధి కోసం బిహార్ నుంచి ఖమ్మం వచ్చిన ఓ కుటుంబానికి చెందిన ఆరేళ్ల ఫైజల్ బుధవారం సాయంత్రం నగరంలోని వైరారోడ్ హవేలీ రెస్టారెంట్ పరిసరాల్లో తిరుగుతుండటాన్ని గమనించిన ఒకరు 1098కు ఫోన్ చేశారు. దీంతో చైల్డ్‌లైన్ బృందం బాలుడిని అమ్మహోంలో చేర్చారు. అనంతరం వివరాలు ఆరా తీశారు. సామాజిక మాధ్యమాల్లో బాలుడి ఫొటోతో సమాచారం వైరల్ చేశారు. బైపాస్ రోడ్‌లో ఓ వెల్డింగ్ షాప్‌లు పనిచేస్తున్న తల్లిదండ్రులకు సమాచారం అందింది. తల్లిదండ్రులు నాజ్ పర్వీన్, ఎండీ షహనవాజ్‌తో పాటు కుటుంబీకులు అమ్మ హోంకు చేరుకొని ధ్రువపత్రాలు చూపించారు. సీడబ్ల్యూసీ సమక్షంలో చైల్డ్‌లైన్ బృందం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భరతరాణి, భాస్కర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

కామేపల్లి(కారేపల్లి): మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన మహిళ భూతగాదాల విషయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నెమలిపురి గ్రామానికి చెందిన భూక్యా మౌనిక తమకు సంబంధించిన ఆస్తిని వేరొకరు ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించుకొన్నారని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా తమను పట్టించుకోకుండా, ప్రహరీ నిర్మించుకున్న వారికే వత్తాసు పలకటంతో పాటు, తమపై కేసు నమోదు చేశారని మనస్తాపానికి గురైన మౌనిక పురుగులమందు తాగింది. స్థానికులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, అర్ధరాత్రి కొత్తలింగాల క్రాస్‌రోడ్డు వద్ద ధర్నా చేపట్టారు. ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి హామీతో ధర్నాను విరమించి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మౌనికను ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పల్లె.. కళ కళ !

ఒకప్పుడు పంచాయతీలు అంటే అందరికి చిన్నచూపు.. రాను రాను పరిస్థితులు మారాయి.. నగరాలకు దీటుగా పంచాయతీలు అభివృద్ధి చెందాయి. జిల్లా కేంద్రానికి సమీపంలోని పలు పంచాయతీల్లో జరిగిన అభివృద్ధిని చూస్తే అందరూ అభివృద్ధి అంటే ఇదేనని చెప్పుకునే పరిస్థితులకు చేరాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సైతం పలు పంచాయతీల్లో జరిగిన అభివృద్ధికి అవార్డులు, ప్రశంసపత్రాలు దక్కడం విశేషం. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యాన జిల్లాలో గ్రామ పంచాయతీలపై కథనం.

– ఖమ్మం సహకారనగర్



తడి చెత్త, పొడి చెత్త సేకరణ చేస్తున్న కార్మికులు

- పంచాయతీల్లో మెరుగైన పాలన.. గ్రామాల్లో సకల సౌకర్యాలు
- నగరాలకు దీటుగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- నెలనెలా కేంద్ర, రాష్ట్రాల నుంచి నిధులు
- డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- నేడు 'పల్లె ప్రగతి దినోత్సవం'

తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2వ తేదీన ఏర్పడగా... నాడు ఖమ్మం జిల్లా 46 మండలాల పరిధిలో 945 పంచాయతీలు ఉండేవి. ఆ తర్వాత జిల్లాల విభజనతో ఖమ్మంలో 20 మండలాల పరిధిలో 427 పంచాయతీలు మిగిలాయి. 2018లో పరిపాలన సౌలభ్యం కోసం తండాలు, 500 జనాభా కలిగిన 167 గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయగా పంచాయతీల సంఖ్య 584కు పెరిగింది. ఆయా జీపీలకు 2019 ఫిబ్రవరి 2న కొత్త పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. ఇక గ్రామ కార్యదర్శుల కొరత తీర్చేందుకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించడంతో పాలన వేగంగా జరుగుతోంది. కాగా, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిసిన ఐదు పంచాయతీలు వివిధ కారణాల నేపథ్యంలో తిరిగి పంచాయతీలుగా మారడంతో ప్రస్తుతం 589 గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి.

2019నుంచి అభివృద్ధి దిశగా...

రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలినాళ్లలో వివిధ సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ముందుకు సాగగా... 2019నుంచి పంచాయతీలను అభివృద్ధి బాట పట్టించేలా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్‌లో పల్లెప్రగతి కార్యక్రమాన్ని తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించేలా ప్రణాళిక రచించారు. ఈ క్రమంలో ప్రజలు, పంచాయతీల నుంచి స్పందన బాగున్న క్రమంలో దానిని మరో నెల రోజుల పాటు పెంచారు. ఆ తర్వాత రెండో విడత, మూడో విడత పల్లెప్రగతి కార్యక్రమాల్లో ప్రధానంగా పారిశుద్ధ్యం, చెత్తా చెదారం తొలగింపు, హరితహారం కింద మొక్కలు నాటటం, విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేపట్టారు.

ట్రాక్టర్లు... మల్టీపర్పస్ వర్కర్లు

పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే తొలుత పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని నిర్ణయించిన ప్రభుత్వం ప్రతి పంచాయతీ చేత ట్రాక్టర్ల కొనుగోలు చేయించింది. దీంతో జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల ద్వారా ప్రతిరోజు చెత్త తరలింపు చేపట్టటంతో పాటు ట్యాంకర్ల ద్వారా హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించేందుకు నీళ్లు పోసేవారు. పంచాయతీల్లో 2,310మంది మల్టీపర్పస్ వర్కర్లను నియమించి వీరిని వివిధ రకాల సేవలకు వినియోగిస్తున్నారు.

రూ.47,213.45లక్షలతో అభివృద్ధి..

రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి 2022–23వ సంవత్సరం వరకు జిల్లాలోని గ్రామపంచాయతీల్లోని వివిధ అభివృద్ధి పనులకు రూ.47,213.45లక్షలు నిధులను విడుదల చేసి అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు. తద్వారా ప్రతీ పంచాయతీకి ఒక నర్సరీ, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల ద్వారా ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ, సేంద్రీయ ఎరువుల తయారీ, ఇంటింటికీ తాగునీరు, సీసీ రోడ్ల నిర్మాణాలు, డ్రైన్లు, కల్వర్టులు ఇలా అనేకం అందుబాటులోకి వచ్చాయి.

మండలాలు	20
గ్రామ పంచాయతీలు	589
పంచాయతీ కార్యదర్శులు	589
మల్టీపర్పస్ వర్కర్లు	2,310
వైకుంఠరథాలు	25
బాడీ ఫ్రీజర్లు	34



మొక్కలకు నీళ్లు పడుతున్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం జీపీ సిబ్బంది

రూ.10 కోట్లతో అభివృద్ధి చేసుకున్నాం



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి పూర్తిగా సహకరించింది. సుమారు రూ.10 కోట్ల నిధులతో పంచాయతీని అభివృద్ధి చేసుకున్నాం. పార్క్, ఓపెన్ జిమ్, నర్సరీ ఏర్పాటు, పల్లెప్రకృతి వనాలు, రహదారుల విస్తరణ, సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర సౌకర్యాలు కల్పించుకున్నాం.

– గుడిపూడి శారద, సర్పంచ్, రఘునాథపాలెం

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోంది. పల్లెప్రగతి ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ట్రాక్టర్ల కొనుగోలు, ట్యాంకర్ల ద్వారా మొక్కల సంరక్షణ, నర్సరీలు, పార్కుల ఏర్పాటు, క్రీడా ప్రాంగణాలు తదితర సౌకర్యాలను కల్పించింది. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వి.వి. అప్పారావు, ఇన్‌చార్జ్ డీపీఓ

ఉక్కపోత .. వడగాల్పులు

ఖమ్మంవ్యవసాయం: ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు.. ఎండ వేడిమికి వడగాల్పులు తోడయ్యాయి. ఓ వైపు వడగాల్పులు వీస్తున్నా .. ఉక్కపోతలు ఉంటున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలు ప్రారంభం కావటంతో విద్యార్థులు బడికి వెళ్లడానికి వెనకాడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే ఇళ్లనుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఇక నిత్యం పనులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎండ తీవ్రతకు పగటి వేళలో పనులు చేయలేకపోతున్నారు. వర్షాలు పడుతూ వాతావరణం చల్లగా మారాల్సి న సమయంలో ఎండలు మండి పోతున్నాయి. వర్షాలు లేకపోవటంతో వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. రైతులు వానల కోసం ఎదరు చూస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ఆలస్యమవుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. బుధవారం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక బాణాపురంలో 43.1, ఖమ్మం నగరంలోని ఖానాపురంలో 42.9, నేలకొండపల్లి, పమ్మిల్లో 42.8, ముదిగొండలో 42.7, తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం, సిరిపురం, గేటు కారేపల్లిలో 42.5, గంగారంలో 42.4, మధిరలో 42.2, సత్తుపల్లిలో 42.1, వేంసూరులో 42, రఘునాథపాలెం, ప్రకాష్‌నగర్‌లలో 41.9, పెద్దగోపతిలో 41.8, రావినూతల, నాగులవంచల్లో 41.7, పెనుబల్లి, తిమ్మారావుపేట, కొనిజర్ల, పంగిడిల్లో 41.6, లింగాలలో 41.4, గుబ్బగుర్తి, వైరా, గౌరారం, కల్లూరులలో 41.3, చింతకానిలో 41.1, మంచుకొండలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఉదయం ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న కటౌట్లు



సాయంత్రం కటౌట్లను తొలగించిన దృశ్యం

కటౌట్లు ఖాళీ

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గురువారం ఖమ్మంలో బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉండగా చివరి నిమిషంలో రద్దయింది. అయితే, బుధవారం ఉదయం అమిత్‌షాతోపాటు ఇతర బీజేపీ నేతలతో కూడిన కటౌట్లు భారీగా కనిపించాయి. సాయంత్రానికి ఎక్కడికక్కడ తీసేయడంతో రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. ఎన్టీఆర్ సర్కిల్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల గోడ పక్కన ఏర్పాటు చేసిన భారీ కటౌట్లను తొలగించారు.

–సాక్షి ఫొటోజర్నలిస్ట్, ఖమ్మం

యువతి ఆత్మహత్య కేసులో ఆరేళ్ల జైలు

ఖమ్మంలీగల్: యువతి ఆత్మహత్యకు కారణమైన కారేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన అంగోతు హనుమాకు ఆరేళ్లు జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అమరావతి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కారేపల్లి మండలం అనంతారం తండా సీతారాంపురం గ్రామానికి చెందిన యువతి ఇల్లెందు డిగ్రీ కళాశాలలో చదవుతోంది. ఆమెకు నిందితుడు మాయమాటలు చెప్పి లోబరుచుకొని మోసం చేయడంతో తట్టుకోలేక 2015 ఆగస్టు 27న కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని చనిపోయింది. ఆ యువతి తండ్రి కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదనపు ప్రాసిక్యూటర్ బి.కృష్ణమోహన్, లైజన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, కోర్టు కానిస్టేబుల్ తోట వెంకటేశ్వర్లు, హోంగార్డు ఓరుగంటి శ్రీనివాసరావు సహకరించారు.

మరోకేసులో ఆరేళ్ల జైలు..

ఆత్మహత్యకు కారకులైన ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన షేక్ ఆషా (25), షేక్ హమిదాబి (50), షేక్ గౌస్ (25)కు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అమరావతి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఫిర్యాది కూతురు హసీనాకు గోళ్లపాడుకు చెందిన షేక్ యాకుబ్‌తో వివాహం జరిగింది. వారి ఇంటి ఎదురుగా ఉన్న షేక్ ఆషా.. హసీనాను మానసికంగా వేధించేది. యాకూబ్‌కు లేనిపోని మాటలు చెప్పి దంపతుల మధ్య గొడవలు సృష్టించేది. దీంతో హసీనా 2016, జులై 2న ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

'నీట్'లో ప్రైవేట్ విద్యాసంస్థల హవా

రెజొనెన్స్ సత్తా..



విద్యార్థులను అభినందిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్లు

ఖమ్మంసహకారనగర్: నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించి అగ్రగామిగా నిలిచారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. మహ్మద్ నాజియాఅంజుమ్ 550 మార్కులు, ఎస్.దేవిక 513, జి.రమ్య 480, కె.సాయిఆనంద్ 462, ఎస్.సాయినేహా 449, వి.జోషిక 417, బి.వినీల 390 మార్కులు సాధించారన్నారు. వారిని యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీశ్, ఎం.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య ప్రతిభ



విజయచిహ్నం చూపిస్తున్న శ్రీధర్, శ్రీవిద్య తదితరులు

ఖమ్మంసహకారనగర్: నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఆలిండియా స్థాయిలో వి.శ్రావ్య 62వ ర్యాంక్, బి.అక్షిత 213, బి.జశ్వంత్ కుమార్‌చౌదరి 239, కె.జన్వితదేవి 495, కె.లీలశ్రీధర్ 511, బి.దివ్య 646, బి.పవన్‌రాథోడ్ 653, కె.గణేశ్ 2331, జి.వరుణ్‌రోహన్ 2725, ఎ.వరుణ్ 3044, జి.సౌజన్య 3448, బి.సాయి 4288, జి.అంజనసౌమ్య 4594, డి.తిరిషా 4710, టి.శ్రీతేజ 6024వ ర్యాంక్‌లు సాధించారన్నారు. వారిని అధ్యాపకులు, యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో బి.సాయిగీతిక, చేతన్‌మాథూర్, ఎస్‌ఆర్‌ఎస్‌డీ వర్మ, బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

న్యూవిజన్ విజయదుందుబి



విద్యార్థులను అభినందిస్తున్న సీహెచ్‌జీకే ప్రసాద్

నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో తమ విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. జాతీయస్థాయి ఓపెన్ కేటగిరిలో బొంకూరి ధనుష్ 460వ ర్యాంక్, వివిధ కేటగిరిల్లో ధనుష్ 96వ ర్యాంక్, డి.జతిన్ 144వ ర్యాంక్, బి.షర్మిల 188, బి.శ్రీలేఖ 339, బి.బాలరాజు 1,555, టి.లిఖిత 1,583, బి.అంకితశ్రీ 1,859 ర్యాంక్, బి.నిత్య 2,025, ఎం.సుష్మశ్రీ 2,154 ర్యాంక్ సాధించి జాతీయస్థాయిలో సత్తా చాటారని చెప్పారు. 720 మార్కులకు గాను తమ విద్యార్థులు 695, 654, 653, 615,591, 584, 582 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గోపిచంద్, కార్తీక్, బ్రహ్మచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టర్ కావాలని ఉంది

– నీట్ టాపర్ బి. ధనుష్ (695మార్కులు, 96వ ర్యాంక్), న్యూవిజన్ కళాశాల, ఖమ్మం



బి.ధనుష్, నీట్ ర్యాంకర్

ఖమ్మంసహకారనగర్ : వైద్య వృత్తిలో స్థిరపడాలనే ఉద్దేశంతో చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుకున్నా. నీట్ పరీక్షలో 720కి గాను 695 మార్కులు సాధించా. ఆలిండియా స్థాయిలో 96వ ర్యాంక్ వచ్చింది. మంచి కళాశాలను ఎంపిక చేసుకుని ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య వృత్తిలో ఉండి సేవ చేయాలనుకుంటున్నా. మా తల్లిదండ్రులు, కళాశాల యజమాన్యం అన్ని రకాలా ప్రోత్సహించడం వల్లే అత్యుత్తమ మార్కులు సాధించగలిగాను. ఎంతో ఆనందంగా ఉంది.

హార్వెస్ట్ విజయకేతనం..



ర్యాంక్ సాధించిన విద్యార్థులతో హార్వెస్ట్ యాజమాన్యం

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఎన్‌టీఏ నిర్వహించిన నీట్‌లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించాలని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. జె.శారోన్ జాకులిన్ 32,476వ ర్యాంక్ (ఓబీసీ విభాగం) సాధించి కళాశాల అగ్రస్థానంలో నిలిచాడని చెప్పారు. ఎ.త్రినాథ్ 39,295 ర్యాంక్, కె.గీతిక 6863 ర్యాంక్ (ఎస్సీ కేటగిరి), ఎస్.జెనీఅక్షయరెడ్డి 47,445 (జనరల్ కేటగిరి) ర్యాంక్, పి.యజ్ఞశ్రీ 1,612 (ఎస్టీ కేటగిరి) ర్యాంక్, ఎ.వరుణ్‌రాజ్ 8,803 (ఎస్సీ కేటగిరి) ర్యాంక్ సాధించారన్నారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీ విజయం



విజయచిహ్నం చూపిస్తున్న డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు

నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు రాయల సతీశ్‌బాబు, ఈగా భరణికుమార్ తెలిపారు. ఆలిండియా స్థాయిలో అరవింద్ 100వ ర్యాంక్, అలేఖ్య 209వ ర్యాంక్, శ్రీవిద్య 371, జాస్మిత 490, శ్రీకీర్తి 512, కల్యాణ్ 618వ ర్యాంక్ సాధించారని చెప్పారు. 600కు పైగా మార్కులు అరవింద్, రోహన్, అయూబ్ సాధించారన్నారు. జయంత్‌రెడ్డి 594 మార్కులు, సహస్రస్వాతి 594, అలేఖ్య 574, సంజన 557, మేఘనరావు 554, అజయ్‌తరుణ్ 550, స్నేహిత 548, శ్రీవిద్య 547, కావ్య సుధ 542, తనస్వినిరాజ్ 539, ఉజ్వల 539, హస్మిన్ 534, జాస్మిత 532, శ్రీకీర్తి 530, పవిత్ర 529, భావన 527, షణ్ముఖ 523, కల్యాణ్ 521, లహరి 510, తేజస్విని 509, సాయిశ్రీ 509, నితిన్ 508, జుహిత 504, భరణి 503, త్రివేణి 501, మీనాక్షి 500 మార్కులు సాధించారన్నారు.

ఎలైట్ అకాడమీ హవా



విద్యార్థులను అభినందిస్తున్న ఎలైట్ అకాడమీ డైరెక్టర్లు

నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిన కనబర్చారని ఎలైట్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు చల్లా శ్రీధర్, కటకం కీర్తి వెంకటరమణ తెలిపారు. ఎం.వెంకటమురళీకృష్ణ 604 మార్కులు, కె.నివేదిత 547, ఎస్.దుర్గామహేశ్ 538, ఎన్.కల్యాణ్ 521, దీక్షిత 512, సీహెచ్ సిరి 512, రిషికారెడ్డి 503 మార్కులు సాధించారన్నారు. వారిని యాజమాన్యం అభినందించింది.

కృష్ణవేణి విజయ పరంపర

నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కె.శ్రేష్ఠ 534 మార్కులు, ఈ.శ్రీకాంత్ 494, బి.వాసు 457, బి.రాకేశ్ 441, కె.చందన 437, ఆర్.బృందావని 404 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచందర్, ఏవో నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కృష్ణవేణి యజమాన్యం

క్లుప్తంగా...

జి-20తో బంధం బలోపేతం

యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



సాక్షి, హైదరాబాద్: జి-20 అగ్రికల్చరల్ వర్కింగ్ గ్రూప్ సమావేశం అమెరికా-భారత్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి గొప్ప అవకాశమని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. ఈ సంవత్సరం జి-20 అధ్యక్ష స్థానంలో భారత్ నాయకత్వాన్ని ఆమె అభినందించారు. భారత సంస్కృతి, వంటకాలు అంతర్జాతీయంగా పేరే న్నికగన్నాయన్నారు. 'టేస్ట్ ఆఫ్ అమెరికా'ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కింద అమెరికాలోని ప్రీమియం వ్యవసాయ ఉత్పత్తులు, బేవరేజెస్‌ను భారతీయులకు రుచికరంగా అందించడానికి వీలవుతోందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ద్వైపాక్షిక వాణిజ్యం పెరగాలని ఆకాంక్షించారు. అమెరికా ఆహార పదార్థాలపై భారత్‌లోని దక్షిణాది ప్రజల్లో ఆసక్తి కల్పించడానికి వీలుగా బుధవారం నాడు ఓ స్టార్ హోటల్‌లో 'హై టీ సెలబ్రేషన్స్'ను నిర్వహించారు. అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన అండర్ సెక్రటరీ గ్జోచిట్ టర్రెస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిస్టా ల్యాబ్ సందర్శించిన జర్మనీ బృందం

తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థకు చెందిన అంతర్జాతీయ విత్తన ప్రయోగశాల (టిస్టా)ను జర్మనీ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో బృందం సమావేశమయ్యింది.

యూఏఈ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ప్రారంభం



బంజారాహిల్స్ (హైదరాబాద్): బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాయబార కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. యూఏఈ మంత్రి అహ్మద్ అలీ అల్ సయేగ్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, హైదరాబాద్‌లో యూఏఈ కాన్సులేట్ జనరల్ ఆర్‌ఎఫ్ అల్ నునైని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి జీ-20 | వ్యవసాయ మంత్రుల సమావేశం

- 3 రోజులు హైదరాబాద్‌లో నిర్వహణ
- 30 దేశాల వ్యవసాయ మంత్రుల రాక



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్ (ఏడబ్ల్యూజీ) మినిస్టీరియల్ సమావేశాలకు హైదరాబాద్ సిద్ధం అయ్యింది. గురువారం నుంచి ఈ నెల 17 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో వివిధ దేశాల వ్యవసాయ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల డైరెక్టర్ జనరల్స్ పాల్గొంటారు. కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కైలాష్ చౌదరి మొదటిరోజు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ఇందులో ప్రదర్శిస్తారు. అనంతరం వ్యవసాయ డిప్యూటీస్ మీటింగ్ (ఏడీఎం) జరుగనుంది. ద్వితీయార్ధంలో అగ్రిబిజినెస్ ఫర్ ప్రాఫిట్, పీపుల్ అండ్ ప్లానెట్ నిర్వహణ, 'డిజిటల్లీ డిస్కనెక్ట్: వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం' కార్యక్రమాలు జరుగుతాయి. జీ-20 సమావేశంలో పాల్గొనే మంత్రులు, ఇతర ప్రతినిధి బృందాల నాయకులకు కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ స్వాగతం పలకడంతో రెండవరోజు సమావేశం ప్రారంభమవుతుంది. ఆహార భద్రత, పౌష్టికాహారం కోసం సుస్థిర వ్యవసాయం, మహిళల నేతృత్వంలోని వ్యవసాయం, సుస్థిర జీవవైవిధ్యం, వాతావరణ సమస్యల పరిష్కారాలపై మంత్రులు, ఉన్నత స్థాయి అధికారుల చర్చలు మూడు సమాంతర సెషన్లలో జరుగుతాయి. మూడవ రోజు భారత్ అధ్యక్షతన అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్, జీ-20 ఫలితాలను ఆమోదించడంతో మంత్రుల సమావేశం ముగుస్తుంది. అనంతరం హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్)కు సాంకేతిక విజ్ఞాన యాత్రకు ప్రతినిధి బృందం వెళ్తుంది.



విత్తిన విత్తనాలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

ఆశలు మొలకెత్తేనా..

చింతపల్లి: వర్షాలు పడగానే విత్తనాలు మొలకెత్తుతాయని పత్తి విత్తనాలను పొడి దుక్కుల్లో వేసేందుకే రైతులు ఆసక్తి చూపుతుంటారు. ఈ ఏడు కూడా అలాగే విత్తిన రైతులు ఇప్పుడు వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పట్లో వానలు పడేట్లు లేవని మరికొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని చిలకరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ శివ సైతం.. తనకున్న ఐదు ఎకరాల భూమిలో పత్తి విత్తనాలు వేశాడు. వానల జాడ లేక వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నాడు. విత్తనాలు భూమిలో మురిగిపోకుండా, మొలకెత్తాలనే ఆశతో ట్యాంకర్‌తో నీటిని పోస్తున్నట్లు శివ తెలిపాడు.

నకిలీ విత్తన ముఠా అరెస్ట్

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు, పరారీలో మరొకరు
- రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం: నల్లగొండ ఎస్పీ



పట్టుబడిన నకిలీ విత్తనాలు, నిందితులతో ఎస్పీ అపూర్వరావు, ఇతర పోలీస్ సిబ్బంది

నార్కట్‌పల్లి: నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్ హిల్స్ ప్రాంతానికి చెందిన గోరంట్ల నాగార్జున, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పెద్దకూరపాడు గ్రామానికి చెందిన గద్దం రవీంద్రబాబు, నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మెరిగె వేణు, అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన నర్సింహ ఓ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటకలో పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి సమీపంలో స్టోరేజీ చేశారు. అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు హైదరాబాద్ మీదుగా తరలించాలని నిర్ణయించుకున్నారు. కారులో నాగార్జున, రవీంద్రబాబు, వేణు బయలుదేరారు. పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఎర్టిగా కారును తనిఖీ చేయగా రెండు బస్తాల విత్తనాలు బయటపడ్డాయి. వాటిని వ్యవసాయ అధికారులు పరిశీలించి నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి మిగతా విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు నర్సింహ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించనున్నట్లు చెప్పారు.

కొద్దిగంటల్లో పెళ్లి... వడదెబ్బతో వరుడు మృతి



తిరుపతి (ఫైల్)

కౌటాల: ఆనందంగా పెళ్లి జరగాల్సిన ఇంట తీవ్ర విషాదం నెలకొంది. మరి కొద్ది గంటల్లో పెళ్లనగా వరుడు వడదెబ్బతో మృతి చెందాడు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం గుడ్లబోరి గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గుండ్ల శ్యాంరావ్, యశోద దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు గుండ్ల తిరుపతి (32)కి ఇటీవల మంచిర్యాల జిల్లా భీమిని గ్రామానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం మధ్యాహ్నం వివాహ ముహూర్తం నిర్ణయించారు. వరుడి ఇంట్లోనే పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో పెళ్లి పత్రికల పంపిణీ, పెళ్లి ఏర్పాట్ల పనుల్లో వారం రోజులుగా అతను ఎండల్లో తిరుగుతున్నాడు. దీంతో తిరుపతి మంగళవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెళ్లి కోసం వేసిన పందిట్లో తిరుపతి మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కలచివేసింది.

మండే ఎండలు.. వడగాల్పులు

- రుతుపవనాల రాక ఆలస్యంతో అధిక ఉష్ణోగ్రతలు
- గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు



సాక్షి, హైదరాబాద్: రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ దిశ నుంచి బలమైన గాలులు వీస్తుండడంతో కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రధానంగా అదిలాబాద్, ఖమ్మం, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇక గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయి. బుధవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా కరీంనగర్ జిల్లా తంగులలో 45.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 42.2 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 25.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
తంగుల	కరీంనగర్	45.4
శ్రీరాంపూర్	పెద్దపల్లి	45.1
తక్కళ్లపల్లి	పెద్దపల్లి	44.4
లక్ష్మీదేవిపల్లి	కొత్తగూడెం	44.2
మల్లాపూర్	జగిత్యాల	44.2

రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	41.8	30.4	ఖమ్మం	42.2	30.0
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	38.7	27.0
హకీంపేట్	39.0	26.8	మెదక్	40.6	25.2
దుండిగల్	39.0	26.0	నల్లగొండ	41.0	25.4
హనుమకొండ	40.5	29.5	నిజామాబాద్	40.3	27.4
హైదరాబాద్	39.1	27.0	రామగుండం	41.6	31.5

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో 'తెలంగాణ టాప్'

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తెలంగాణ ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డీఏఆర్‌పీజీ) ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరుపై నెలవారీ నివేదికను బుధవారం విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం సగటున ఒక్కో ఫిర్యాదు పరిష్కారానికి కేవలం 8 రోజుల సమయం మాత్రమే తీసుకుందని ప్రకటించింది. కాగా మొత్తం నాలుగు కేటగిరీల్లో రాష్ట్రాలను విభజించి ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకింగ్స్ ఇచ్చింది. 72.49 శాతం ఫిర్యాదుల పరిష్కారంతో 15 వేల కంటే తక్కువ ఫిర్యాదుల కేటగిరీలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి మే 31 వరకు తెలంగాణలో 2,633 ఫిర్యాదులు అందాయి. దేశంలోనే అతి తక్కువ సమయంలో 2,524 ఫిర్యాదులను పరిష్కరించిన తెలంగాణ రాష్ట్రం, పరిష్కార కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచిందని నివేదికలో వెల్లడించింది. అంతేగాక 15 వేల కంటే ఎక్కువ ఫిర్యాదుల కేటగిరీలో ఉత్తరప్రదేశ్ 1,16,840 ఫిర్యాదుల్లో 62.07 శాతం పరిష్కరించి ఆ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచింది.

జిల్లా వార్తలు

రక్తదాతకు గవర్నర్ పురస్కారం



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న మురళి

భద్రాచలంఅర్బన్: 50 సార్లకు పైగా రకదానం చేసి పలువురిని అపత్కర పరిస్థితుల్లో ఆదుకున్న భద్రాచలానికి చెందిన కొప్పుల మురళి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా విశిష్ట పురస్కారం అందుకున్నాడు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో ప్రపంచ రక్తదాన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో రక్తదానం చేసిన మురళిని గవర్నర్ అభినందించారు.

పేదల గుడిసెలపై ప్రతాపమా..?



మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

అశ్వారావుపేట: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన ప్రభుత్వాలు వారి గుడిసెలు తొలగించేందుకు అరాచకాలు చేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య మండిపడ్డారు. బుధవారం అశ్వారావుపేటలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన మూడురోజుల రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. 58 జీఓ ప్రకారం స్వాధీనంలో ఉన్న భూములకు పట్టాలిస్తానన్న ముఖ్యమంత్రి అదే జీఓతో ధనవంతులకే మేలు చేస్తున్నారన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు సాధించేందుకు ఈనెల 19 నుంచి 21 వరకు తహసీల్దార్లకు నేరుగా దరఖాస్తులు అందజేయడం, 18 నుంచి 21 వరకు బస్సుయాత్ర ద్వారా పేదలను సమీకరించి ఉద్యమం చేపడతామని తెలిపారు. జూలై 3న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య, మాదినేని రమేష్, వి.వెంకటేశ్వర్లు, కందాల ప్రమీల, బొంతు రాంబాబు, డి.బాల్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, బాలరాజుగౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటాడుకుందామా..!

- పాఠశాలల క్రీడలకు మార్గం సుగమం
- పట్టణ, మండల, జోన్, జిల్లాస్థాయిలో టోర్నీలు
- సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిర్ణయం
- ఈసారి ఎస్‌జీఎఫ్, శాట్స్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా పోటీలు





పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు (ఇన్‌సెట్) బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారుడు

ఖమ్మం స్పోర్ట్స్: ఏటా రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడలు ఎంతో ఉత్సాహంగా కొనసాగేవి. కానీ గత మూడేళ్లుగా కరోనా నేపథ్యాన జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మంగళం పాడేసింది. అయితే, పరిస్థితులు చక్కబడిన నేపథ్యాన మళ్లీ ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎజీఎఫ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్స్) సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇటీవల సంయుక్తంగా జరిగిన సమావేశంలో క్యాలెండర్ సైతం విడుదల చేశారు.

ఆగస్టులో ఆరంభం

జాతీయస్థాయి పోటీలకు అనుగుణంగా ముందస్తుగానే రాష్ట్ర జట్లను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆగస్టు మొదటి, రెండో వారాల్లో పట్టణస్థాయిలో పూర్తి చేసుకుని జోనల్‌స్థాయి(నిర్ణయించిన మండలాలు) క్రీడలను ఆగస్టు మూడో వారంలో జరిపేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాస్థాయి పోటీలను సెప్టెంబర్ రెండో వారంలో జరపాలని నిశ్చయించుకున్నారు. అదే విధంగా రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడలను హైదరాబాద్‌లో జరపాలనే నిర్ణయం జరిగింది. దీనికి సంబంధించిన ప్రణాళికలను ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారికి పంపినట్లు సమాచారం.

'శాట్స్'ను కూడా కలుపుకుని...

ఇంత వరకు ఈ పోటీలను కేవలం రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మాత్రమే నిర్వహించేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం శాట్స్‌ను కూడా బాధ్యులను చేయడంతో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 2000 సంవత్సరంలో కంబైన్డ్ క్రీడల పేరిట స్కూల్ గేమ్స్, అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జరిపాయి. కానీ రెండింటి మధ్య పొసగకపోవడంతో మళ్లీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీలు వేర్వేరుగానే పోటీలు జరిపాయి. గతంలో స్పోర్ట్స్ అథారిటీలకు గ్రామీణ క్రీడోత్సవాలు, మహిళ క్రీడోత్సవాలు ఏటా జరుగుతుండేవి. కేంద్ర ప్రభుత్వం 2004 నుంచి క్రీడా పాలసీలను మార్చడంతో పై క్రీడోత్సవాలకు జాతీయ స్థాయిలోనే మంగళం పాడారు. దీంతో పంచాయతీ యువ క్రీడా ఖేల్ అభియాన్(పైకా), రాజీవ్ క్రీడా ఖేల్ అభియాన్ క్రీడలను జరిపారు. 2014 నుంచి మొత్తంగా పై రెండు క్రీడలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసి ఖేలో ఇండియా పేరుతో జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు మాత్రమే నిర్వహిస్తోంది. గత కొంత కాలంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా రెండేళ్ల నుంచి వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను నిర్వహించడం లేదు. ఈసారి నుంచి పాఠశాలల క్రీడలు జరిగే అవకాశం ఉండటంతో పాఠశాలల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు నూతనోత్సాహంతో ఉన్నారు.

అండర్-19 క్రీడలపై అయోమయం

జూనియర్ కళాశాలల్లో చదివే క్రీడాకారులను మాత్రమే అండర్-19 విభాగంలో దాదాపు 30 క్రీడాంశాలకు పైగా పాల్గొనే అవకాశం ఉంది. అయితే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఫిజికల్ డైరెక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. కనీసం క్రీడా జట్ల ఎంపికలను చేయలేని దుస్థితి జిల్లాలో ఉంది. వరంగల్ రీజియన్‌లో ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లు మాత్రమే ఉన్నారు. అయితే స్కూల్ గేమ్స్ నిర్వాహకులను ప్రతిసారి బతిమిలాడి క్రీడా జట్లను ఆయా జిల్లాల్లో ఎంపిక చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఒకే ఒక ఫిజికల్ డైరెక్టర్ మాత్రమే ఉన్నారు. అయితే గతంలో జిల్లాస్థాయిలో నిర్వహించడంతో ఈసారి తాను చేయలేనని చేతులేత్తేసినట్లు తెలిసింది. ఉత్సాహవంతులైన క్రీడాకారులు ఉన్న వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయలేక పోయినా కనీసం ఎలిజిబులిటి ఫారాలు నింపే వారు కరువవడం శోచనీయం.

పాత బకాయిలకు మంగళం

రాష్ట్రంలోని గతంలో నిర్వహించిన పాఠశాలల క్రీడలను రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిల్లా క్రీడల కార్యదర్శులకు పాత బకాయిలు చెల్లించే విషయంలో ఇప్పటి వరకు ఏలాంటి హామీ ఇవ్వకపోగా బిల్లులు సమర్పించిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిధులను మంజూరు చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈసారి నేరుగా రాష్ట్రస్థాయి పోటీలను హైదరాబాద్‌లో జరపడం వెనుక ఆంతర్యమేంటని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గతంలో నిర్వహించిన క్రీడల కార్యదర్శులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే గతంలో మాదిరిగా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్‌కు ప్రతి ఏటా రూ.3 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జాతీయ పోటీల వరకు ఖర్చు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించేది. గత కొంతకాలంగా పై విధానానికి స్వస్తి పలికి జిల్లా కార్యదర్శులు మాత్రమే అన్ని ఖర్చులు పెట్టుకుని తర్వాత బిల్లు సమర్పించాలని చెప్పడంతో అదే విధంగా చేస్తున్నారు. ఇన్ని వ్యయప్రయాసలకోర్చి ఖర్చులు పెట్టినా బిల్లు ఇవ్వడంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

విధుల్లోకి మార్కెట్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: పదోన్నతి పొందిన వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులు బుధవారం విధుల్లో చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది సహాయ కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ పదోన్నతులు కల్పించింది. ఈ ప్రక్రియలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుగురు సహాయ కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా పదోన్నతులు లభించిన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లో విధుల నుంచి విడుదలై కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు చేపట్టారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శులుగా పనిచేస్తున్న డి.నిర్మల గ్రేడ్-3 కార్యదర్శిగా పదోన్నతి పొంది భద్రాకొత్తగూడెం జిల్లా బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. మరో సహాయ కార్యదర్శి ఎస్. రాజేంద్రప్రసాద్ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్-3 కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. వైరా వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.నాగేశ్వరి నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్-3 కార్యదర్శిగా, కల్లూరు వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న తాడేపల్లి కిరణ్ గ్రేడ్-3 కార్యదర్శిగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం విధుల్లో చేరారు.

రాజధానికి 'ఉత్తమ' సర్పంచ్‌లు

నేడు హైదరాబాద్‌లో పల్లె ప్రగతి సభ

నేలకొండపల్లి/ చుంచుపల్లి : రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం గురువారం పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన పంచాయతీలను ఎంపిక చేశారు. ఆయా సర్పంచ్‌లను ఆహ్వానించడంతో పాటు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు, భద్రాద్రి జిల్లా నుంచి ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లను సైతం ఆహ్వానించారు. వారిని సన్మానించి, పురస్కారం అందించనున్నారు. ఎంపికైన వాటిలో ఖమ్మం జిల్లాకు చెందిన చింతకాని మండలం తిమ్మినేనిపాలెం, చిన్నమండవ, వందనం, నాగిలిగొండ, చింతకాని, లచ్చగూడెం, బోనకల్ మండలం చిరునోముల, బోనకల్, నేలకొండపల్లి మండలం మోటాపురం, కూసుమంచి మండల కేంద్ర పంచాయతీ, కొణిజర్ల మండలం పెద్దగోపతి, మధిర మండలం నాగవరప్పుపాడు, మోటమర్రి, వేంసూరు మండలం బైరవునిపాడు, ముదిగొండ మండలం పమ్మి, మేడేపల్లి, సత్తుపల్లి మండలం కిష్టారం, కొత్తూరు, కాకర్లపల్లి, తల్లాడ మండల కేంద్రంతో పాటు కుర్నవల్లి, కల్లూరు మండల కేంద్రం, తిరుమలాయపాలెం మండల కేంద్రం, రఘునాధపాలెం మండలం రేగులచెలక, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు పంచాయతీలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలోని గౌతంపూర్, జమేదార్ బంజర, సుజాతనగర్, మోరంపల్లి బంజర, బోడు, కాకర్ల, ఉప్పుసాక, తొట్టిపంపు, కోయగూడెం, అకినేపల్లి, అంబేడ్కర్‌నగర్, చల్ల సముద్రం, అశ్వారావుపేట, వేపలగడ్డ, చింతోనిచెలక, చింతగుప్ప గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికే ప్రాధాన్యం..

సింగరేణి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉమేశ్ మధూకర్‌రావు



రక్షణ చర్యలపై సూచనలిస్తున్న ఉమేశ్‌మధూకర్‌రావు

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఓపెన్‌కాస్ట్ పని ప్రదేశాల్లో రక్షణతో కూడిన ఉత్పత్తికే ప్రాధాన్యమివ్వాలని సింగరేణి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) ఉమేశ్‌మధూకర్‌రావు ఆదేశించారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీల్లో సావర్కర్, డీడీఎంఎస్ (మైనింగ్) కమలేశ్‌కుమార్‌వర్మతో కలిసి ఆయన పర్యటించారు. కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ స్వాగతం పలికారు. జేవీఆర్, కిష్టారం ఉపరితల గనుల్లో వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు, బొగ్గు రవాణాను పరిశీలించారు. రక్షణపై తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ పూర్తి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని, కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు ఎప్పటికప్పుడు పని ప్రదేశాలను పరిశీలించాలని సూచించారు. అనంతరం 150 మంది కాంట్రాక్ట్ కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎంలు గురవయ్య, కుమారస్వామి, జీవీ కోటిరెడ్డి, ఓసీల పీఓలు వెంకటాచారి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ అవార్డుల ప్రదానం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ సంస్థ, రోటరీక్లబ్ ఆఫ్ ఇన్‌భద్రా ఆధ్వర్యంలో బుధవారం సారపాక ఐటీసీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఒకేషనల్ అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ ఇన్‌భద్రా ప్రెసిడెంట్ భాస్కర్ మాట్లాడుతూ.. ఐటీసీలో వివిధ డిపార్ట్‌మెంట్లకు చెందిన 11 మంది సర్వీస్ ప్రొవైడర్ ఉద్యోగులకు అవార్డులు అందించామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, జేకే దాస్, ఏపీఎస్ గోవిందరావు, మరదాన శ్రీనివాస్, చాంద్ బాషా, రవికుమార్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, షేక్ బాషా, యుపీ రావు, వై.సుధాకర్‌రెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, మురళి, యేసోబు, మహేశ్‌రెడ్డి, సత్యనారాయణ, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.